

## ఏజెన్సీ ప్రాంతంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నిర్మల్ జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 9: ఖానాపూర్ నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి-గిరిజనుల ఎదురుకుంటున్న దీర్ఘకాలిక సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాదులోని వారి నివాసంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఆదివాసీ పెద్దలు,వివిధ సంఘాల నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ని కలిశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.దసరా పండుగ అనంతరం హైదరాబాద్ లోని సెక్రటేరియట్లో అన్ని శాఖల అధికారులతో- ఆదివాసి పెద్దలతో,అన్ని ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి తక్షణమే ఆదివాసీల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు.ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు.గతంలో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో సభను ఏర్పాటు చేశామన్నారు. ఐటీడీఏలను అభివృద్ధి పరచి ఆదివాసి-గిరిజనుల సమస్యల పరిష్కారమయ్యేలా ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని,ఐటిఐ కళాశాలలను అప్గ్రేట్ చేసి ఆదివాసి యువతకు మెరుగైన విద్యను అందిస్తామన్నారు.జైనూరు బాధితురాలికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని,బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంతవంతమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి ఆదివాసీ పెద్దలు కృషి చేయాలని,గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొమరం భీం మనువడు కొమరం సోనేరావ్,ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ,ఆదివాసీ పెద్దలు, అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

**ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**మక్తల్ లో స్వయంసేవకుల పథ సంచలన్**

మక్తల్ అక్టోబర్ 9 వైస్ టుడే ప్రతినిధి: హిందూ ధర్మాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మక్తల్ పట్టణంలో ఏడు రోజులపాటు ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్ష వర్గ పూర్తయిన సందర్భంగా విజయదశమి పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం మక్తల్ పట్టణ పురవీధుల గుండా స్వయంసేవకుల పథ సంచలన్ పెద్ద ఎత్తున నిర్వహించారు . పట్టణ పురవీధుల గుండా సాగిన పథ సంచలన్ ఆకట్టుకుంది.అనంతరం స్థానిక స్టేడియం గ్రౌండ్లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా బుగులె పరమేశ్వర్, వసంతం వెంకటేశ్వర్,డాక్టర్ అనిల్ కుమార్, బాధ్యత నిర్వహిస్తున్నారు పాల్గనగా ముఖ్య వక్తగా ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా యువతను కళాశాలల వద్ద హిందూ యువతులను లవ్ జిహాదీ పేరుతో వలలో వేసుకొని మతమార్పిడులకు పాల్పడుతున్నారని అన్నారు.మతమార్పిడులు కట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుంచుకోవాలన్నారు. హిందూ సంఘటన ద్వారానే భారత దేశ సంక్షేమం సాధ్యమని గుర్తించి 1925లో డాక్టర్ జీ ఆర్ఎస్ఎస్ ను స్థాపించడం జరిగిందన్నారు .నేడు ప్రపంచవ్యాప్తంగా మారుమూల పల్లెల్లో సంఘ శాఖలు కొనసాగుతున్నాయని అన్నారు .దేశంలో ఎక్కడ ఏ ఉపద్రవం ముందుకు వచ్చిన సంఘ కార్యకర్తలు అక్కడ ముందుండి సేవా అందిస్తున్నారని అన్నారు. సమాజ నిర్మాణం జరగాలని సంఘం లక్ష్యమని అన్నారు. హిందూ పండుగల సమయంలో అనేక వాదనలు ముందుకు వస్తుంటాయని అన్నారు. ప్రతిరోజు జరిగే ఆర్ ఎస్ ఎస్ సంఘ శాఖ ద్వారా శారీరక మానసిక భౌద్దిక్ అంశాలను తోపాటు దేశభక్తిని పెంపొందించడం లక్ష్యంగా కొనసాగుతున్నాయని అన్నారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు . ఆర్ఎస్ఎస్ స్థాపించి 99 సంవత్సరాల పూర్తి చేసుకుని 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి హిందువు హిందూ ధర్మ పరీక్షణ కోసం కంకణం కట్టుకొని ముందుకు సాగాలని అన్నారు .ఈ కార్యక్రమంలో మ్యాడం ప్రభాకర్, కర్రెం నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇంతకుముందు ఫారెస్ట్ కార్యకర్తలు దర్శించిన శారీరక దండ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

## జ్ఞాన సరస్వతి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

రామకృష్ణాపూర్ అక్టోబర్ 9 వాయిస్ టుడే: రామకృష్ణాపూర్ పట్టణంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 13వ వార్డు రామాలయం విజయ దుర్గ భవాని మండపంలో బుధవారం ఏడవ రోజు జ్ఞాన సరస్వతి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొంతమల్ల లావణ్య శ్యామ్ దంపతులు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లేళ్ల అశోక్, దొంతమల్ల రమేష్ ,శ్యామ్, కుమార్ వనపర్తి ప్రవీణ్ ,పొన్నం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ రేంజి పరిధిలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు

**విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి..**

**పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా..**

**ఆకస్మిక డైనమిక్ వెహికల్ చెకింగ్స్..**

**మాదకద్రవ్యాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి..**

**డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి..**

**జిల్లాలలో క్రైమ్ ప్రోన్ ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలి..**

**రేంజ్ ఎస్ పి లతో డి ఐ జి జూమ్ మీటింగ్..**




విశాఖపట్నం, అక్టోబర్ 9 వాయిస్ టుడే ప్రతినిధి) : విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ డి ఐ జి గోపీనాథ్ జెట్టి ఆదేశించారు.విశాఖవట్నం రేంజ్ ఎస్పీలతో ఆయన బుధవారం జూమ్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చెయ్యాలని అదే సందర్భంలో పక్కా దాడులు నిర్వహించాలని జిల్లాల ఎస్పీలను ఆదేశించారుగంజాయి నియంత్రణలో భాగంగా ఆకస్మికంగా డైనమిక్ వెహికల్ చెకింగ్సు చేపట్టాలన్నారు. బాణసంచా దుకాణదారులు, గోడౌన్లు వద్ద భద్రత ప్రమాణాలను పర్యవేక్షించాలని డిఐజి ఆదేశించారు.

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి జూమ్ మీటింగు లో ఆదేశించారు. రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. రేంజ్ పరిధిలో ఎక్కడ గంజాయి సాగు జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయ వంటలను సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణ, వినియోగం చేయడం వలన విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను రైతులకు వివరించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ జిల్లాలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను కుణ్ణంగా చేపట్టాలని, ఆధునిక సాంకేతికతను, స్నిఫర్ డాగ్స్ ఇప్పటికే గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణకు తరుచూ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీలకు రేంజ్ డిఐజి ఆదేశించారు. బాణసంచా షావులు, గోడౌన్లు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను డిఐజి ఆదేశించారు. పేకాట స్థావరాలను గుర్తించేందుకు నిఘా పెట్టాలని, జిల్లాల్లో ఎక్కడా జూదం, క్రికెట్ బెట్టింగు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరాలను నియంత్రించుటలో భాగంగా ప్రతీ జిల్లాలోను క్రైం ప్రోన్ ఏరియాలను గుర్తించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఏ తరహా నేరం జరిగినా సిసి కెమెరాల్లో నేరానికి సంబంధించిన వీడియోలు నిక్షిప్తమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి, పంపాలన్నారు. సైబరు నేరాలను నియంత్రించుటలో భాగంగా ప్రజలకు సైబరు మోసాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు సైబరు మోసాలకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని, గతంలో నమోదైన సైబరు కేసుల్లో బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు తిరిగి చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న హత్య కేసులు, లాంగ్ పెండింగు కేసులను, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు సంబంధించి నమోదైన రేప్, వరకట్న మరణాలు, పోక్సో కేసులను రేంజ్ డిఐజి సమీక్షించి, దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని, నిందితులు న్యాయస్థానాల్లో శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించే విధంగా దర్యాప్తు అధికారులు చర్యలు చేపట్టే విధంగా చూడాలని జిల్లా ఎస్పీలను ఆదేశించారు. అదే విధంగా బాలికలు, బాలుర అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించకుండా, కేసు నమోదైన వెంటనే వారిని అచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని జిల్లాల ఎస్పీలను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్సులో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం. దీపిక, ఎ.ఎస్.ఆర్. జిల్లా ఎస్పీ అమిత్ బర?ర్, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతిని దేవతగా కొలిచే సంస్కృతి తెలంగాణప్రజలది

**హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు**



వాయిస్ టుడే ప్రతినిధి (హుస్నాబాద్/కోహెడ)అక్టోబర్09: గౌరమ్మ, దుర్గమ్మ దీవెనలతో హుస్నాబాద్ ని యోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్అన్నారు. ప్రకృతిని దేవతగా కొలిచే సంస్కృతి కేవలం తెలంగాణ ప్రజలకు మాత్రమే సొంతమని, ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి సంస్కృతి కనబడదని మాజీఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఆడపడుచులకు, ప్రజలకు సతీష్ కుమార్ సద్దుల బతుకమ్మ, విజయదశమి దసరా శుభాకాంక్షలను తెలిపారు. బతుకమ్మ, గౌరమ్మ, దుర్గామాతల దీవెనలతో హుస్నాబాద్ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు



## రహదారుల నిర్మాణం పై ప్రత్యేక దృష్టి

**30 కోట్లతో డబుల్ లైన్ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే, ఎంపి నాగేష్**

నిర్మల్ జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 9: కేంద్ర ప్రభుత్వం ద్వారా నియోజకవర్గం లో రహదారుల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. బుధవారం ముధోల్ మండల కేంద్రం లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి వాస్తపూర్ గ్రామం వరకు సి. ఆర్.ఎఫ్. కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 14 గ్రామాలకు సౌకర్యార్థం కేంద్రం ద్వారా నిధులు తేవడం జరిగిందన్నారు. దశల వారిగా కేంద్రం నిధులతో రోడ్లను అభివృద్ధి పరుస్తామన్నారు. ఎంపి నగేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సడక్ యోజన, సి. ఆర్. ఎఫ్. నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. దివంగత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజపేయి,, ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో నే జాతీయ రహదారులు, అంత రాష్ట్రీయ, రోడ్లు, గ్రామాల రోడ్లు ఎక్కువ నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం బాసర దీవి నవరాత్రులు భాగంగా మూల నక్షత్రం శుభదినాన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

## నేడు వాసవి మాత దేవాలయంలో హంస వాహనంపై అమ్మవారి తెప్పోత్సవం

మక్తల్ అక్టోబర్ 9 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొమ్మిది రోజులపాటు అమ్మవారి పూజ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుచున్నాయి. 19వ దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నేడు సాయంత్రం 7:30 గంటలకు ఆలయంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నామని, ఇట్టి కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడితోపాటు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారని, ఇట్టి కార్యక్రమానికి పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. తెప్పోత్సవంలో భాగంగా వాసవి మాత హంస వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దేవి మాతను ప్రతిష్టించిన ప్రతి మండపం లో నదిలో, కోలనులోను అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం కొలనులో వాహనంపై స్వామివారు దర్శనం ఇస్తారు. కావున అందరు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాగలరని కమిటీ సభ్యులు కోరారు.

## కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



అనంత పురం అక్టోబర్ 09 వాయిస్ టుడే : శింగనమల నియోజకవర్గం నార్పల మండల పరిధిలోని పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా కూతలేరు వంక ఎస్సీ కాలనీ , సుల్తాన్ పేటా ఇందిరమ్మ కాలనీ యందు 36.75 లక్షల రూపాయల తో నిర్మించే సిసి రోడ్ల కొరకు నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శిలాఫలకము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణి శ్రీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేయడం చాలా సంతోషమని పేర్కొన్నారు.

## కోదాడ సబ్ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సిలివేరు వెంకటేశ్వర్లు



కోదాడ: అక్టోబర్ 9 వాయిస్ టుడే ప్రతినిధి )సూర్యాపేట జిల్లా కోదాడ సబ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా సీనియర్ న్యాయవాది శిలివేరు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కోదాడ బార్ అసోసియేషన్ లో గత మూడు దశాబ్దాలుగా సిలివేరు వెంకటేశ్వర్లు న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారు. ఆయన గతంలో కోదాడ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, ఎస్బిఐ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా పనిచేశారు. వెంకటేశ్వర్లు విద్యాభ్యాసం 10వ తరగతి వరకు చిట్యాల ప్రభుత్వ పాఠశాల లో, ఇంటర్ రామన్నపేట ప్రభుత్వ కళాశాల లో , డిగ్రీ హైదారాబాద్ లోని అంబేద్కర్ కళాశాలలో లా డిగ్రీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఎపీపీ గా ఎంపికైన సందర్బంగా సిలివేరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.కాగా కోర్టులో ఎ పీ పీ గా విధుల్లో చేరుతున్న వెంకటేశ్వర్లు ను స్నేహితులు, పలువురు న్యాయవాదులు, పురప్రముఖులు అభినందించారు.



## జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ నందు ఘనంగా బతుకమ్మ సంబరాలు

**పోలీస్ సురక్షా బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 9) బుధవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు పోలీస్ రక్ష బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ శాఖలో పని చేసే మహిళా అధికారులు సిబ్బంది కుటుంబసభ్యులు ఈ బతుకమ్మ వేడుకకు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.పూలను పూజిస్తూ,ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మను అత్యంత వైభవంగా జరుపుకోవాలన్నారు. జిల్లా ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మ జరుపుకుంటారన్నారు.